క్లుప్తంగా

పరేడ్‌కు సిద్ధమవుతున్న సిబ్బంది

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఈనెల 15న స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జరిగే పరేడ్‌కు సింగరేణి సెక్యూరిటీ గార్డులు సిద్ధమవుతున్నారు. సిబ్బందితో శనివారం సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్ ప్రాక్టీస్ చేయించి పలు సూచనలు చేశారు.

పెండింగ్ డీఏ, పీఆర్‌సీ ప్రకటించండి..


యూటీఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ డీఏలతో పాటు పీఆర్‌సీ ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ డిమాండ్ చేసింది. శనివారం ఇల్లెందులోని జేబీఎస్ స్కూల్ ఆవరణలో మండల కమిటీ ఆధ్వర్యంలో యూటీఎఫ్ 50వ ఆవతరణ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రాంబాబు, టి.జయరాజు తెలిపారు. ఉపాధ్యాయ రీ గ్రూప్ స్కేల్ సాధించటం, అప్రెంటీస్ విధానం రద్దు, 2008లో 13 రోజుల సమ్మె చేయటం, 25 వేల మందికి ప్రమోషన్స్ ఇప్పించటం లాంటి అనేక విజయాలు యూటీఎఫ్ సాధించిందన్నారు.ఈ అన్నపూర్ణ, శేషగిరి, వెంకటేశ్వర్లు, గుండాల బాధ్యులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొత్త ప్రాజెక్టులు, ఉత్పత్తిపై సమీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా ఏరియాల సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కొత్తగూడెంలోని ప్రధాన కార్యదర్శి నుంచి జీఎం సివిల్ సూర్యనారాయణ శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపైలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ప్రాజెక్టుల పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేయాలని సూచించారు. అలాగే, రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని చెప్పిన ఆయన నిర్మాణ పనుల పురోగతి, కాలనీల్లో పారిశుద్ధ్య పనులపై ఆరా తీశారు.

స్థానికులనే నియమించాలి

జూలూరుపాడు: మిషన్ భగీరథ పంపు ఆపరేటర్ల ఉద్యోగానికి స్థానికులనే నియమించాలని కోరుతూ బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు శనివారం ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను జూలూరుపాడులో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జూలూరుపాడు మండలంలోని దళిత, గిరిజనులకు మిషన్ భగీరథ పంపు ఆపరేటర్ల ఉద్యోగం ఏ ఒక్కరికీ ఇవ్వకుండా స్థానికేతరులకు ఇవ్వడం వల్ల తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, స్థానికులకు అవకాశం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.

ఆలయ నిర్మాణం తొలగింపు

పాల్వంచరూరల్: స్థానిక గిరిజన సహకార సంస్థ బ్రాంచి కార్యాలయ స్థలంలో హమాలీ కాలనీకి చెందినవారు రేకుల షెడ్ వేసి గుడి నిర్మాణం చేయడం వివాదస్పదంగా మారింది. జీసీసీ స్థలంలో పెట్రోల్‌బంక్‌ను నిర్మాణం చేయనున్న స్థలాన్ని ఆక్రమించి గుడి నిర్మించారని, వెంటనే తొలగించాలని మేనేజర్ లక్ష్మాజీ శుక్రవారం మున్సిపల్ కమిషనర్, పట్టణ ఎస్ఐలకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జీసీసీ స్థలంలో నిర్మించిన గుడిని తొలగించడానికి శనివారం మున్సిపల్ సిబ్బంది రాగా గుడి బాధితులు... మున్సిపల్ సిబ్బంది, అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ సమస్యను ఐటీడీఏ పీఓకు ఫిర్యాదు చేయగా అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు మేనేజర్ తెలిపారు. దీంతో రేకుల షెడ్ వేసి నిర్మించిన గుడిని తొలగించారు.

సీతారామ ప్రాజెక్ట్ జలాలు ఏజెన్సీకి దక్కాలి



ఆందోళన చేస్తున్న నాయకులు

పాల్వంచ: సీతారామ ప్రాజెక్ట్ జలాలు ఏజెన్సీ ప్రాంతానికి ఇవ్వాలని, ఏజెన్సీ మండలాలపై జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు సమాధానం ఇచ్చాకే ప్రారంభోత్సవం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించి, విగ్రహానికి వినతిపత్రం అందించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ... సీతారామ ప్రాజెక్ట్ నీటిని మంత్రులు మైదాన ప్రాంతాలకు తరలించే యత్నం చేస్తున్నారని ఆరోపించారు. పోడు రైతులకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. వీరమల్ల మల్లయ్య, శ్రీనివాస్, రాజేష్, నరసింహారావు, వెంకన్న, మల్లేశ్, రమేశ్, భీమా పాల్గొన్నారు.

తండాల్లో 'తీజ్' సందడి

- భక్తిశ్రద్ధలతో గోధుమ మొక్కల పెంపకం
- ఉపవాస దీక్షల్లో యువతులు
- కులపెద్ద అనుమతితో పండుగ ప్రారంభం


పోచారంతండాలో తీజ్ వేడుకల కోసం సిద్ధం చేసిన పందిరి


తీజ్ బుట్టలతో యువతులు, చిన్నారులు (ఫైల్)



సండే స్పెషల్

ఇల్లెందురూరల్: గిరిజనుల జీవన విధానం ప్రకృతితో ముడిపడి ఉంటుంది. విభిన్న సంస్కృతి, సంప్రదాయలు, ఆచార వ్యవహారాలు ఉంటాయి. ముఖ్యంగా లంబాడా గిరిజనులకు తమ సంప్రదాయ పండుగల్లో ప్రత్యేకమైనది తీజ్ వేడుక. వారి కట్టు, బొట్టు, ఆచార వ్యవహారాలలో రోజురోజుకూ మార్పు వస్తున్నప్పటికి సంస్కృతిని చాటే 'తీజ్'ను ఇప్పటికీ తరగని ఉత్సాహంతో జరుపుకుంటున్నారు. ఈ సనాతన పండుగలో ఆరోగ్య సూత్రాలు, సామాజిక నీతి, ఆధ్యాత్మిక సందేశం ప్రకృతి సంబంధాలు మిళితమై ఉంటాయి. ప్రస్తుతం జిల్లా అంతటా లంబాడీలు తీజ్ వేడుకల నిర్వహణకు అంకురార్పణ చేశారు.

తండాపెద్ద అనుమతితోనే..

తండాల్లో తీజ్ పండుగను పెళ్లికాని యువతులే నిర్వహించడం గిరిజన సంప్రదాయం. ఏటా శ్రావణమాసంలో తీజ్ వేడుకలు తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తారు. ఉత్సవాలలో పెళ్లికాని యువతులు పంటలు సమృద్ధిగా పండాలని, వ్యాధుల బారి నుంచి తమ గ్రామాన్ని కాపాడాలని, మంచి జీవిత భాగస్వామి రావాలని కోరుకుంటూ భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుంటారు.

పండుగకు సన్నాహకంగా పెళ్లికాని యువతులు ముందుగా తండాలోని గ్రామ పెద్ద వద్దకు వెళ్తారు. పండుగ జరుపుకునేందుకు అనుమతి కోరుతారు. అందుకు తండా పెద్ద అనుమతి ఇస్తూ నిర్వహణకు ఆదేశాలు జారీ చేస్తారు. గతంలో తండాకు ఒక నాయకుడు ఉండగా ప్రస్తుతం ఇద్దరు, ముగ్గురు ఉంటున్నారు. ఆ నాయకులే పండుగ నిర్వహణకు అయ్యే ఖర్చు భరించేవారు. ప్రస్తుతం కొంత మార్పు వచ్చింది.

సోదరుల సహకారం..

పండుగ నిర్వహణకు అనుమతి తీసుకున్న అమ్మాయిలంతా కలిసి అదేరోజు గోధుమలను సేకరించి నానబెడతారు. మొలకెత్తించేందుకు అవసరమయ్యే బుట్టల తయారీకి యువతుల సోదరులు అటవీ ప్రాంతంలో దొరికే దూసేరు తీగను తెచ్చి బుట్టలు అల్లుతారు. పుట్టమట్టి తెచ్చి అందులో ఎరువు కలుపుతారు. లంబాడా దేవతలు తుజభవాని, సేవాభాయి, సీత్లా భవానీ పేర్లతో బుట్టలో మొదటగా తండా నాయకుడితో ఎరువు కలిపిన మట్టిని పోయిస్తారు. ఆ తరువాత నానబెట్టిన గోధుమలను బుట్టలలో చల్లి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిరిపైకి చేరుస్తారు.

ఇంటికో బుట్ట...

తండాల్లోని ఒక్కో ఇంటి నుంచి యువతులు ఒక్కో తీజ్ బుట్టను సిద్ధం చేస్తారు. బుట్టలన్నీ ఒకేచోట ఉండేందుకు వీలుగా తండా నాయకుడి ఇంటి ముందు పందిరి వేస్తారు. ఆ పందిరిపై తీజ్ బుట్టలను ఉంచుతారు.

భక్తిశ్రద్ధలతో పూజ...

తొమ్మిది రోజులపాటు అమ్మాయిలు ఉపవాసాలు ఉంటూ పండుగ జరుపుకుంటారు. రోజూ తీజ్ బట్టలలో నీరు పోస్తూ కులదేవతలకు పూజ చేస్తారు. పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ సంబురాలు జరుపుకుంటారు. చెరువు నుంచి నీటిని తీసుకొచ్చే క్రమంలో యువకులు ఆటపట్టిస్తుంటారు. అబ్బాయిలు వేసిన పొడుపు కథలకు అమ్మాయిలు సమాధానం చెబితేనే నీళ్లను నారులో పోయాలి లేదంటే మళ్లీ నీటిని తీసుకురావాలి. ఇలా సరదాగా వేడుకలు కొనసాగుతాయి.

వైభవంగా నిమజ్జనం..

తొమ్మిదోరోజు గ్రామపెద్ద ఇంటి ఆవరణలో గ్రామస్తులంతా ఒకచోట చేరుతారు. యువతులు తీజ్ బుట్టలను పందిరిపై నుంచి దింపి గోధుమ నారును తెంపుతారు. నారును ముందుగా తండా పెద్ద తలపాగలో పెడతారు. ఆపదలో రక్షణగా ఉండాలని నారు మొక్కలను సోదరులకు అందించి వారి ఆశీర్వాదం తీసుకుంటారు. తమ ఆరాధ్య దేవతలకు పూజ చేసి తీజ్‌బుట్టలను తలపై పెట్టుకొని మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి సమీపంలోని వాగు లేదా చెరువులో నిమజ్జనం చేస్తారు.

సంతోషంగా జరుపుకుంటాం..



గ్రామపెద్దలు, సోదరుల సహకారంతో ఏటా తీజ్ పండుగను భక్తిశ్రద్ధలతో సంతోషంగా జరుపుకుంటాం. ఆరాధ్య దైవాలను కొలుస్తూ తొమ్మిది రోజులపాటు ఉపవాసదీక్షలు ఆచరిస్తాం. నిమజ్జనం వేడుక భక్తిభావాన్ని పెంపొందిస్తూ సరదానూ పంచుతుంది.

– బానోత్ జమున, లక్ష్మీనారాయణ తండా

తీజ్ సందేశాత్మక వేడుక...



తీజ్ పండుగ ప్రతీఒక్కరికి ఆరోగ్య, ఆధ్యాత్మిక సందేశాన్ని అందించే వేడుక. ప్రకృతితో అనుబంధం, సామాజిక నీతి, ఆధ్యాత్మిక సందేశం, ఆరోగ్య సూత్రాలు కలగలిసిన పండుగ. నిత్యం శ్రమైకజీవనంతో సాగే తమలో సందడిని, సంబురాన్ని తెస్తుంది.

– ఇస్లావత్ సుమిత్ర, పోచారం తండా

పోరాటాలతోనే మహిళా హక్కులకు రక్షణ


మాట్లాడుతున్న జ్యోతి

సింగరేణి(కొత్తగూడెం): పోరాటాల ద్వారానే మహిళా హక్కులకు రక్షణ అని, మహిళల హక్కుల సాధనకు అక్టోబర్ 21, 22, 23 తేదీలలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా రాష్ట్ర 4వ మహాసభలు భద్రాద్రి కొత్తగూడెంలో జరగనున్నాయని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.జ్యోతి, రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం కొత్తగూడెంలోని యూటీఎఫ్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఐద్వా రాష్ట్ర మహాసభల జయప్రదం కోసం ఆహ్వాన సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మహిళల రక్షణ కోసం వారి హక్కుల సాధన కోసం అహర్నిశలు కృషి చేస్తూ రాష్ట్రంలో అతిపెద్ద మహిళా సంఘంగా ఐక్య పోరాటాలు చేస్తూ మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా రాష్ట్ర మహాసభలు కొత్తగూడెంలో జరుగుతున్నాయని తెలిపారు. మండల జ్యోతి, ఏ.అరుణజ్యోతి, కళావతి, డి.లక్ష్మి, వాణి, సంధ్య, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

జూలూరుపాడు: వైరాలో ఈనెల 15న జరగనున్న సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్న నేపథ్యాన పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పిలుపునిచ్చారు. జూలూరుపాడులో శనివారం ఆయన మాట్లాడారు. అదేరోజు సీతారామ ప్రాజెక్టు ద్వారా నీరు విడుదల, రూ.2లక్షల రుణ మాఫీ చెక్కులు అందిస్తారని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు రాజీవ్ కెనాల్ (సీతారామ) ద్వారా గోదావరి జలాలను జూలూరుపాడు మండలానికి చేరుస్తామని.. ఈ విషయంలో అపోహలు పెట్టుకోవద్దని చెప్పారు. చెరువులు, కుంటలను గోదావరి జలాలతో నింపే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే అన్నారు. పలువురు కార్యకర్తలు సీతారామ కెనాల్ ద్వారా మండలానికి నీరు ఇవ్వకుండా పక్క జిల్లాకు తరలించడం సరికాదని చెప్పడంతో ఎమ్మెల్యే పైవిధంగా స్పందించారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, సొసైటీ చైర్మన్ చీమలపాటి భిక్షం, లేళ్ల వెంకటరెడ్డి, కె.రంగారావు, మాలోత్ మంగీలాల్ నాయక్, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

ఇల్లెందు: కొత్తపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి మృతికి కారణమైన వార్డెన్ మీద చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ డిమాండ్ చేసింది. శనివారం ఇల్లెందులో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నేతలు బయ్యా అభిమన్యు, కాళంగి హరికృష్ణ మాట్లాడుతూ... సమాచారం లేకుండా విద్యార్థులు బయటకు ఎలా వచ్చారని ప్రశ్నించారు. విద్యార్థుల యోగక్షేమాల కోసం పని చేయాల్సిన పర్యవేక్షణ అధికారులు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వాచ్‌మెన్, నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని, ఖాళీ సిబ్బందిని భర్తీ చేయాలని కోరారు.

రైల్వే పెన్షనర్లకు సన్మానం


సన్మానం అందుకున్న పెన్షనర్లతో నాయకులు


రైల్వేశాఖలో సేవలందించి రిటైర్డ్ అయిన ఉద్యోగులను శనివారం కొత్తగూడెంలో ఎండీ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తోటి ఉద్యోగులు పూలమాలలు, శాలువాలు కప్పి శేషజీవితం ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. – కొత్తగూడెంఅర్బన్

సేవాలాల్ సేన, యువసేన కమిటీ ఎన్నిక


బి.శ్రీను

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం తోగ్గూడెం గ్రామానికి చెందిన బాదావత్ శ్రీనును సేవాలాల్‌సేన యువసేన రాష్ట్ర అధ్యక్షుడిగా సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోతు రాంబాబు నాయక్ నియమించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో త్రిసభ్య కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్‌నాయక్, రాములునాయక్, ఎంపీ సీతారాంనాయక్, ప్రధాన పూజారి బోజు మహారాజ్ చేతుల మీదుగా శుక్రవారం నియమాకపత్రాన్ని అందుకున్నట్లు శ్రీను తెలిపారు. సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు.

జిల్లా అధ్యక్షుడిగా భరత్..


బానోతు భరత్

పాండురంగాపురం గ్రామానికి చెందిన బానోతు భరత్‌ను సేవాలాల్ యువసేన జిల్లా అధ్యక్షుడిగా శనివారం రాష్ట్ర అధిష్టానం రెండోసారి నియమించింది.

ఈ మేరకు తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను విస్మరించకుండా గిరిజన తండాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగిస్తానని, అందరికీ అందుబాటులో ఉంటూ సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని భరత్ తెలిపారు.

సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడిగా శివ..


శివనాయక్

టేకులపల్లి: బంజారాల అభివృద్ధి, సంక్షేమం కోసం ఏర్పడిన సేవాలాల్ సేన కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా టేకులపల్లి మండలం చుక్కాలబోడు గ్రామానికి చెందిన మాలోతు శివనాయక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం మాట్లాడుతూ..

జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా సదస్సులో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్, రాష్ట్ర కన్వీనర్ మాలోతు సైదా నాయక్, బానోతు హుస్సేన్ నాయక్, బానోతు కిషన్‌నాయక్‌ల సమక్షంలో తనను జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించి బాధ్యతను పెంచినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. చిత్తశుద్ధితో సంఘం అభివృద్ధి, బంజారాల సంక్షేమం కోసం, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

గనుల్లో రక్షణపై సీఎండీ సమీక్ష


నూతన కార్యాలయ భవనాన్ని పరిశీలిస్తున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం)/ఇల్లెందు: గనుల్లో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సింగరేణి సీఎండీ బలరామ్ ఏరియాల వారీగా అధికారులు, పిట్, సేఫ్టీ, మైన్స్ కమిటీలతో శనివారం సమీక్షించారు. హైదరాబాద్ నుంచి ఆయన వీసీ ద్వారా సమీక్షించగా కొత్తగూడెం నుంచి జీఎం షాలేంరాజు, ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, వివిధ విభాగాల అధికారులు, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గనుల్లో ప్రమాదం జరగకుండా అవగాహన కల్పించాని సూచించారు. ప్రతీ ఉద్యోగి హెల్మెట్ వాడేలా చూడడంతో పాటు అధికారులు సైతం అవగాహన కల్పిస్తూ సంస్థ అభివృద్ధి, ప్రమాదాల నివారణలో పాలుపంచుకోవాలని తెలిపారు. అనంతరం కొత్తగూడెం ఏరియా పరిధిలోని 3 ఇంక్లైన్‌లో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న జీఎం నూతన కార్యాలయాన్ని శనివారం జీఎం శాలేంరాజు ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏజీఎం సివిల్ రామకృష్ణతో కలిసి పరిశీలించారు. కాగా, సీఎండీ వీడియో కాన్ఫరెన్స్‌కు ఇల్లెందు నుంచి హాజరైన ఏరియా జీఎం జాన్ ఆనంద్ మాట్లాడుతూ.. సింగరేణి కార్మికులు, ఉద్యోగుల రక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఉద్యోగులు బొల్లం వెంకటేశ్వర్లు, వి.శ్రీనివాస్, జీవీ మోహన్‌రావు, సౌరభ్ సుమన్, పూర్ణచందర్, రాజు, శివప్రసాద్ పాల్గొన్నారు.

హైపవర్ వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న బీఎంఎస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కోలిండియా మాదిరిగా సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు అమలు చేయాలని అఖిల భారత కథాన్ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్)జాతీయ కార్యవర్గ సభ్యులు, మానిటరింగ్ కమిటీ సభ్యులు పులి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం రాంచీలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా బొగ్గు గనుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని, సామాజికి భద్రత (సీఎంపీఎఫ్, ఈఎస్ఐ, పీఎల్ఆర్ఎస్, సీహెడ్‌డీలు, ప్లేడేలు) కల్పించాలని, పర్మనెంట్ కార్మికులతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. అదేవిధంగా బొగ్గు గనులకు చెందిన అన్ని ప్రాంతాలకార్మికులకు ఒకేరకమైన వేతనం, ఇతర సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వివిధ యూనియన్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయండి



మాట్లాడుతున్న రమేష్

సింగరేణి(కొత్తగూడెం): ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని, ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ.18000 కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూరపాటి రమేష్ డిమాండ్ చేశారు. శనివారం కొత్తగూడెంలోని సీసీఎం జిల్లా కార్యాలయంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పూజెం రూనీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్ స్కీమ్‌ను బలహీనపరుస్తోందని ఆరోపించారు. బడ్జెట్ కేటాయింపుల్లో కోత పెట్టి ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పి బాధ్యతల నుంచి తప్పించుకోవాలని కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్‌హెచ్‌ఎం కింద పనిచేస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పీఎఫ్ ఈఎస్ఐ సహా చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలు పరిష్కారం చేయకుండా మోదీ ప్రభుత్వం కార్మిక హక్కుల్ని కాలరాస్తోందని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేస్తోందన్నారు. కులం, మతం ప్రాంతీయ, విద్యాశాఖలు కార్మిక ఐక్యతకు బీజేపీ విధానాలు ప్రథమ శత్రువుగా ఉన్నాయని వాటిని ఎదురించి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కే.బ్రహ్మాచారి, ఎంబీ అప్పారావు, ధనలక్ష్మి, వీరన్న, కే.సత్య, సుశీల, సుజాత పాల్గొన్నారు.

అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది..


మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

పాల్వంచరూరల్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీనికి నిదర్శనం మల్కాన్‌గిరి నుంచి పాండురంగాపురం రైల్వేలైన్ మంజూరు చేయడమేనని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం మల్కాన్‌గిరి నుంచి పాండురంగాపురం వరకు 173.63 కిలోమీటర్ల నూతన రైల్వేలైన్ నిర్మాణానికి రూ.500 కోట్ల ప్రాజెక్ట్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయం అన్నారు. రైల్వేలైన్ మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్విన్‌వైష్ణవ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న రాష్ట్రబడ్జెట్‌లో జిల్లాకు శూన్యమేనన్నారు. హైదరాబాద్ నుంచి రాజమండ్రి వరకు వయా ఖమ్మం మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తికాగా, కొత్తగూడెం క్రాస్ రోడ్డు నుంచి ఇల్లెందు, మహబూబాబాద్, తొర్రూరు మీదుగా వెలుగొండ, హైదరాబాద్ వరకు హైవే పనులు వేగంగా జరుగుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల చెరువు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు రాపాక రమేష్, భూక్యా రవినాయక్ పాల్గొన్నారు.

అదే బడిలో.. చదువు, బోధన, రిటైర్మెంట్


స్వాతంత్య్ర వజ్రోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థులతో ర్యాలీలో వీరభద్రరావు (ఫైల్)

- నాటి విద్యార్థి నేడు ప్రధానోపాధ్యాయుడు
- ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందనున్న వీరభద్రరావు

సుజాతనగర్: పాఠాలు నేర్చుకున్న బడిలోనే ఉపాధ్యాయుడిగా పనిచేయడం గొప్ప అనుభూతి.. చదివిన చోటే ఉద్యోగం రావడం ఒక ఎత్తయితే అదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా.. అంతే కాకుండా అక్కడే ఉద్యోగ విరమణ పొందడం మరో విశేషం. చెప్పలేని ఆనందం.... అంతటి అదృష్టం సుజాతనగర్ జిల్లా పరిషత ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థి చిట్లూరి వీరభద్రరావుకు దక్కింది. ఈ పాఠశాలలో చదువుకుని, ఇక్కడే ఉపాధ్యాయుడిగా ఇక్కడే హెడ్‌మాస్టర్‌గా ఈ నెలలో ఇక్కడే ఉద్యోగ విరమణ చేయనున్న వీరభద్రరావు గురించి....

స్వస్థలంలోనే విద్యాభ్యాసం...

సుజాతనగర్‌కు చెందిన చిట్లూరి కనకరావు, హైమావతి దంపతుల సంతానం వీరభద్రరావు. 1వ తరగతి నుంచి 10 వరకు సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల.. ఇంటర్, డిగ్రీ కొత్తగూడెంలో.. పీజీ డీసీఏ ఉస్మానియాలో.. డీపీఏ అంబేద్కర్ యూనివర్సిటీలో.. బీఈడీ ఉస్మానియాలో.. కర్ణాటకలోని కువెంపు యూనివర్సిటీలో ఎంఎస్సీ.. గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో ఎంఎస్సీ(మాథ్స్).. కోయంబత్తూరు భారతీయ యూనివర్సిటీలో ఎంఈడీ.. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఎంఫిల్ విద్యను పూర్తి చేశారు. 1989లో డీఎస్సీ పరీక్ష రాసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఫస్ట్ ర్యాంకుతో ఎస్జీటీగా ఉద్యోగం సాధించారు. తొలి పోస్టింగ్ కూనవరంలో 8 ఏళ్లు, ఆ తర్వాత స్కూల్ అసిస్టెంట్‌గా ఎర్రుపాలెం మండలం మామినూరులో పనిచేశారు. ఎస్ఏ మ్యాథ్స్ ఉపాధ్యాయుడిగా జూలూరుపాడుకు బదిలీ అయ్యారు. అనంతరం సొంత ఊరులోని పాఠశాలకే బదిలీ అయ్యారు. ఇదే పాఠశాలలో ఇటీవల హెచ్‌ఎం కూడా అయ్యారు.

31న ఉద్యోగ విరమణ..

అప్పటి చదువులకు, ఇప్పటి చదువులకు చాలా తేడా ఉందని అంటున్నారు వీరభద్రరావు. అప్పటి ఉపాధ్యాయులు వృత్తి పట్ల గౌరవంతో, కర్తవ్యంతో పిల్లలను విద్యాబుద్ధులు బోధించేవారు. అలాగే విద్యార్థులకు కూడా గురువుల పట్ల భయభక్తులు ఉండేవి. ఇప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో అది లోపించింది. తాను ఏనాడూ ఉత్తమ ఉపాధ్యాయుడి కోసం దరఖాస్తు చేయలేదని తెలిపారు. తనకు ఇద్దరు సంతానం అని, వారిద్దరూ డాక్టర్లని, శేష జీవితం పిల్లలతో గడుపుతానని వివరించారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గారాంప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183